నమస్తే తెలంగాణ
# నల్లగొండ
3 | నల్లగొండ, గురువారం 3 అక్టోబర్ 2024 | NALGONDA

# గాంధీజీ మార్గాన్ని అనుసరించాలి

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



గాంధీ విగ్రహానికి వెండి కిరీటాన్ని అలంకరిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, అక్టోబర్ 2 : యువత గాంధీ మహాత్ముడి మార్గాన్ని అనుసరించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడిలో నిర్వహించిన దేవాలయ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి, పల్నాడుకు చెందిన భక్తులు సమర్పించిన వెండి కిరీటాన్ని గాంధీ విగ్రహానికి అలంకరించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ శాంతి మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన గాంధీజీ అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. దేశం కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. కార్యక్రమంలో మహాత్మా ఛారిటబుల్ ట్రస్టు చీఫ్ డాక్టర్ సీత, సలహాదారులు జోగినెపల్లి శ్రీనివాసరావు, ఆర్య, వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, చిట్యాల మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, మేడిశెట్టి శ్రవణ్, రంగా వెంకటేశ్వర్లు, కలకుంట్ల రవికుమార్ పాల్గొన్నారు.



ఎంజీయూలో ఆర్ట్స్ బ్లాక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి తదితరులు

# మన్నించు మహాత్మా..!

● ఎంజీయూలో గాంధీ జయంతిపై నిర్లక్ష్యం.. ● కేవలం 18మందితో కార్యక్రమం

రామగిరి, అక్టోబర్ 2 : మహాత్మా గాంధీ పేరుతో ఏర్పాటు చేసిన ఎంజీయూలో గాంధీ జయంతి నిర్వహణ పేలవంగా సాగింది. వర్సిటీలో ఆర్ట్స్, కామర్స్, బిజినెస్‌మేనేజ్‌మెంట్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. దాదాపుగా 22 కోర్సులు, 250 రెగ్యులర్, కాంట్రాక్ట్ బోధన, బోధనేతర సిబ్బంది, 2,400 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా, బుధవారం గాంధీ జయంతికి మాత్రం పట్టుమని 18మంది మాత్రమే హాజరయ్యారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఎన్‌ఎస్‌ఎస్ మాజీ కో ఆర్డినేటర్ దోమల రమేశ్, మాజీ సీవోఈ డాక్టర్ మిర్యాల రమేశ్‌కుమార్, పీడీలు డాక్టర్ ఆర్.మురళి, డాక్టర్‌వై.శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్ట్, అతిథి అధ్యాపకులు ఎల్.మధు, సైదులు, ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఆర్.హరికుమార్, సెక్యూరిటీ అధికారి నర్సింహ, శ్రీహరి, డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే పాల్గొన్నారు. అయితే ఓఎస్‌డీతోపాటు వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొపెసర్లు ఎవరూ రాలేదు. యూనివర్సిటీ హాస్టళ్లలో 1,200మందికి పైగా విద్యార్థులు ఉన్నా హాజరు కాలేదు.

# ఎంజీయూకు కొత్త వీసీ!

ఎల్లుండి సెర్చ్ కమిటీ భేటీ

● ముగ్గురి పేర్లు ఖరారు చేయనున్న కమిటీ ● కొత్త వీసీ నియామకంపై ఉత్కంఠ

రామగిరి, అక్టోబర్ 2 : మహాత్మాగాంధీ యూనివర్సిటీకి త్వరలో కొత్త వైస్ చాన్స్‌లర్ నియామకమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల భర్తీకి కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ ఈ నెల 4న భేటీ కానున్నది. ఈ సమావేశంలో ఎంజీయూకు సంబంధించి ముగ్గురి పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నది. సెర్చ్ కమిటీ భేటీ నేపథ్యంలో ఆశావహుతోపాటు వర్సిటీ వర్గాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఆశావహులు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల నియామకం కోసం ప్రభుత్వం గతంలోనే సెర్చ్ కమిటీని నియమించింది. ఆశావహుల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించారు. సెర్చ్ కమిటీ భేటీ కాకపోవడంతో వీసీల నియామక ప్రక్రియలో ముందడుగు పడలేదు. సెర్చ్ కమిటీ భేటీకి ఈ నెల 4న ముహూర్తం ఖరారైంది. ఎంజీయూ వీసీ పోస్టుకు 152 మంది ఆశావాహుల నుంచి వచ్చిన దరఖాస్తులు అందాయి. వాటిని పరిశీలించనున్న కమిటీ ముగ్గురి పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదించనుంది. ఈ నేపథ్యంలో ఎంజీయూ కొత్త వీసీగా ఎవరు వస్తారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చాలామంది పోటీ పడుతుండడంతో ఎలాంటి అర్హతలను ప్రాతిపదికగా తీసుకుంటారు అన్నది ఉత్కంఠకు దారి తీస్తున్నది. ప్రభుత్వం నైపుణ్యాలను అర్హతగా తీసుకుని విలువలతో కూడిన వ్యక్తులను వీసీగా నియమిస్తుందా, లేదా పైరవీలకు పెద్దపీట వేస్తుందా అనే చర్చ వర్సిటీ వర్గాల్లో నడుస్తున్నది.

# నేటి నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

● ఉమ్మడి జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు ● హాజరుకానున్న 1,035 మంది విద్యార్థులు

రామగిరి/సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 2 : తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో పదో తరగతికి ఒకటి, ఇంటర్మీడియట్‌కు మరొక సెంటర్ కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు జరుగనున్నాయి. మొత్తంగా 1,035 మంది హాజరుకానున్నారు. వారిలో నల్లగొండ జిల్లాలో పదో తరగతిలో 149, ఇంటర్మీడియట్‌లో 360, సూర్యాపేట జిల్లాలో టెన్త్‌లో 70, ఇంటర్మీడియట్ 260, యదాద్రిభువనగిరి జిల్లాలో టెన్త్ 89, ఇంటర్మీడియట్ విద్యార్థులు 107మంది ఉన్నారు.

**పరీక్ష కేంద్రాలు ఇవే..**

- పదో తరగతి-ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, దేవరకొండ రోడ్డు, నల్లగొండ
- ఇంటర్మీడియట్- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆర్‌పీ రోడ్డు, నల్లగొండ
- పదో తరగతి-జడ్పీహైస్కూల్ (గర్ల్స్), సూర్యాపేట
- ఇంటర్మీడియట్- ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2, సూర్యాపేట
- పదో తరగతి-ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భువనగిరి
- ఇంటర్మీడియట్-ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ), భువనగిరి

# ఎంగిలి పూల సంబురం

## వైభవంగా బతుకమ్మ పండుగ ప్రారంభం



సూర్యాపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో ఆడిపాడిన ఆడబిడ్డలు

తీరొక్క బతుకమ్మలు ఒక్క చోటకు

హోరెత్తిన ఉయ్యాల పాటలు

రామగిరి , అక్టోబర్ 2 : ఊరూ వాడా బతుకమ్మ పండుగ ప్రారంభమైంది. నిండు అమావాస్య నాడు నెలవంక నేలకు దిగి ఆడబిడ్డల నెత్తిన పొడిచినట్టు వెలుగు పూల సంబురం వెల్లివిరిసింది. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిది రోజుల పూల జాతరకు ఆడబిడ్డలు ఘనంగా స్వాగతం పలికారు. పొద్దుగాల నుంచే తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక్క చోటకు చేర్చి.. 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ' అంటూ అమ్మను ఆరాధించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ పదం కలుపుతూ, పాదం కదుపుతూ సంబురం చేశారు. ఊరూవాడ ఉయ్యాల పాటలతో హోరెత్తించి ప్రకృతి వేడుకకు పట్టం గట్టారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రాల్లో మైదానాల్లో, కాలనీల్లో అంగరంగ వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ ఆడారు.పిల్లలు, పెద్దవాళ్లు కలిసి సంతోషం పంచుకున్నారు. రెండో భద్రాద్రి పేరున్న నల్లగొండ రామగిరిలోని సీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణ బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలతో కిక్కిరిసింది. ఆలయ ప్రధాన అర్చకులు శఠగోపాలాచార్యులు ముందుగా వెంపని చెట్టు, బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. గంటల తరబడి ఆడి పాడి వాయినాలు, ప్రసాదం ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం బతుకమ్మలకు గంగమ్మ ఒడికి చేర్చారు. రెండోరోజు గురువారం అటుకుల బతుకమ్మ ఆడనున్నారు.






సూర్యాపేట సద్దుల చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత, మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ తదితరులు



నల్లగొండలోని వేంకటేశ్వరాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ప్రతి ఫ్యామిలీకి డిజిటల్ కార్డు

## నేటి నుంచి సర్వే ప్రారంభం



36 బృందాల ఏర్పాటు.. నిత్యం 30 ఇండ్లలో వివరాల సేకరణ

నల్లగొండ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 6 గ్రామ పంచాయతీలు

నియోజవర్గానికి ఒక మున్సిపల్ వార్డు, ఒక గ్రామపంచాయతీ

నీలగిరి, అక్టోబర్ 2 : ప్రతి ఒక్కరికీ గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఉన్నట్టే ప్రతి కుటుంబానికీ ఒక డిజిటల్ కార్డు ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధమైంది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మున్సిపల్ వార్డు, ఒక చిన్న గ్రామ పంచాయతీలో సర్వే చేసేందుకు నిర్ణయించింది. కుటుంబ డిజిటల్ కార్డు జారీ కోసం జిల్లాలో 12 ప్రాంతాలను పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసింది. వివరాల సేకరణకు 155 మంది సిబ్బందితో 36 బృందాలను ఏర్పాటు చేసింది. ప్రతి బృందంలో ఆయా ఇండ్లను బట్టి నలుగురు నుంచి ఆరుగురు సభ్యులు, ఒక ఫొటోగ్రాఫర్ ఉంటారు. ప్రతి టీమ్‌కు ఒక తాసీల్దార్, ఎంపీడీఓ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో అందుబాటును బట్టి మండల అధికారులు, ఒక ఫొటోగ్రాఫర్‌ను కేటాయించారు. వీరు రోజూ ఒక్కో బృందం 30 కుటుంబాల చొప్పున 5 రోజులపాటు 150 ఇండ్లకు వెళ్తుంది. మొత్తం 5,400 కుటుంబాల వివరాలను సేకరిస్తారు. ఆ వివరాలు నమోదు చేయడమే గాక మార్పులు చేర్పులకు అవకాశం ఇస్తారు. కుటుంబ సభ్యులందరూ సమ్మతం తెలిపిన తర్వాతే కార్డు కోసం ఫొటో తీసుకుంటారు. సర్వే పర్యవేక్షణకు ఆరుగురు అధికారులను నియమించారు. గురువారం ఉదయం 9 గంటలకు సర్వేను ప్రారంభించి ఐదు రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఈ నెల 7లోపు వివరాలను సమర్పించనున్నారు. సర్వే చేయడానికి ముందుగానే ఆయా బృందాలకు బేస్ డేటాను ఇస్తారు. కుటుంబ డిజిటల్ కార్డు కోసం ప్రజలు వారి ఆధార్ కార్డు సహా సర్వే బృందాలకు అందుబాటులో ఉండి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఆధార్ లేకుంటే ఇతర ఏదైనా గుర్తింపు కార్డు ఇస్తే సరిపోతుంది. ఒక వ్యక్తి రెండు కుటుంబాల్లో సభ్యులుగా ఉండకూడదని అధికారులు చెప్పన్నారు. సర్వే అనంతరం కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఒక ఐడీ నెంబర్‌తో కార్డు ఇవ్వనున్నారు.

### ఏమిటీ డిజిటల్ కార్డు


ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు వివిధ రకాల గుర్తింపు కార్డులున్నాయి. ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డు ఇలా అన్నీ వివరాలను కలిసి ఒక్కటే డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాల రుణాల, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు తదితర వివరాల డేటా ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్నందున వాటిని నిర్ధారించుకుంటారు. కుటుంబంలో ఎవరైనా మరణించి ఉంటే వారి పేర్లు తొలగిస్తారు. ఇటీవల పుట్టిన పిల్లల వివరాలు నమోదు చేస్తారు.

### డిజిటల్ సర్వే చేయనున్న ప్రాంతాలు

| నియోజకవర్గం | గ్రామపంచాయతీ | టీమ్‌లు | సభ్యులు | మున్సిపాలిటీ | టీమ్‌లు | సభ్యులు |
|---|---|---|---|---|---|---|
| నల్లగొండ | గంగన్నపాలెం(తిప్పర్తి) | 2 | 6 | 4వ వార్డు, నల్లగొండ | 9 | 27 |
| నకిరేకల్ | రామచంద్రపురం(కట్టంగూర్) | 2 | 8 | 9వ వార్డు, నకిరేకల్ | 3 | 18 |
| మునుగోడు | జమస్తాన్‌పల్లి(మునుగోడు) | 2 | 12 | 3వ వార్డు, చండూర్ | 3 | 18 |
| దేవరకొండ | అచ్చంపేట పట్టి(చందపేట) | 1 | 6 | 20వ వార్డు, చండూర్ | 2 | 12 |
| నాగార్జునసాగర్ | కొణతాలపల్లి(త్రిపురారం) | 2 | 8 | 11వ వార్డు, నందికొండ | 2 | 8 |
| మిర్యాలగూడ | రుద్రారం(మిర్యాలగూడ) | 2 | 8 | 23వ వార్డు, మిర్యాలగూడ | 6 | 24 |

# డిజిటల్ కార్డులకు వివరాలు అందించాలి

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, అక్టోబర్ 2 : డిజిటల్ కార్డుల సర్వేకు ప్రజలు తమ కుటుంబ సభ్యులు వివరాలు అందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో తెలంగాణ డిజిటల్ కార్డుల బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో కుటుంబ సభ్యులు అందరూ ఉండేలా గ్రూఫ్ ఫొటో తీసుకోవాలని, ఎవరైనా అందుబాటులో లేకుండా ఐదు రోజుల్లో తిరిగి ఆ ఇంటికి వెళ్లి ఫొటోను సేకరించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. వివరాల సేకరణ కోసం వచ్చే బృందాలకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గృహ నిర్మాహణ శాఖ పీడీ రాజ్‌కుమార్, నల్లగొండ ఆర్డీఓ శ్రీదేవి, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్లు, తాసీల్దార్లు, సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# నేడు ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల చలో హైదరాబాద్

● ఇందిరా పార్కు వద్ద ధర్నా

● పెద్దఎత్తున తరలివెళ్లేందుకు రైతులు సన్నద్ధం

చౌటుప్పల్, అక్టోబర్ 2 : రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులు బుధవారం తమ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు రాజధానిలో నిరసనకు సమాయత్తమయ్యారు. భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఇచ్చిన చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనున్నారు. ధర్నాకు జిల్లాలోని భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి దాదాపు వెయ్యి మంది వరకు రైతులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న తెలుస్తున్నది. కుటుంబాలతో వెళ్లి నిరసన తెలపాలని భావిస్తున్నారు. ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభం అవుతుందని, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై సంఘీభావం తెలుపుతారని ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ నాలుగు ప్రధాన రహదారులకు 40 కిలోమీటర్ల దూరంలో జంక్షన్ ఏర్పాటు చేస్తూ.. చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28 కిలోమీటర్లు దూరంలో నిర్మించడం సరికాదని ఈ ధర్నా ద్వారా చెప్పదలుచుకున్నారు. ప్రభుత్వం భూములు తీసుకుంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర చెల్లించాలని, లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవే డిమాండ్లలో కొన్ని రోజులు వివిధ రూపాల్లో అందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఊరటనిచ్చిన వాన

వేసవిని తలపించిన ఎండల నుంచి ఉపశమనం

తిరుమలగిరిలో 6 సెంటీ మీటర్లు నమోదు



కేతేపల్లిలో ఈదురు గాలులకు నేలవాలిన వరి పైరు

సూర్యాపేట, అక్టోబర్ 2 : కొద్దిరోజుల నుంచి భానుడి భగభగతో అల్లాడి పోతున్న ప్రజలు బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపిరి పీల్చుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వారం నుంచి దాదాపు 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. ఎండ వేడి, ఉక్కపోతకు జనం తీవ్ర అవస్థ పడ్డారు. వానకాలమైనా వాతావరణ పరిస్థితులు అలా లేకపోవడంతో ఎప్పుడు వర్షం వస్తుందా అని ఎదురుచూశారు. బుధవారం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్షం పడడంతో కొంత ఊరట పొందారు. తిరుమలగిరి మండలంలో 6 సెంటీమీటర్లు, నడిగూడెం, సూర్యాపేటలో 4, అనంతగిరి, నాగారంలో 2, మద్దిరాల, ఆత్మకూర్.ఎస్ మండలంలో ఒక్క సెంటీమీటరు చొప్పున వర్షపాతం నమోదైంది. చివ్వెంల, నూతనకల్, జాజిరెడ్డిగూడెంలో సెంటీమీటరులోపు వర్షం పడింది.

### పిడుగుపాటుతో ఆవుల మృత్యువాత

కట్టంగూర్ : కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో పిడుగుపడి రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన సూరారపు స్వరాజ్యం ఊరి శివారులోని చెరువు సమీపంలో ఆవులను మేపుతుండగా.. పిడుగు పడి రెండు ఆవులు చనిపోయాయి. స్వరాజ్యం కొంత దూరంగా ఉండడంతో ప్రాణాలతో బయట పడింది. లక్ష రూపాయల నష్టం జరిగిందని బాధిత రైతు ఆమె ఆవేదన చేసింది.

### నేలకొరిగిన వరి

కేతేపల్లి : కేతేపల్లి మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో కోతకు వచ్చిన దశలో ఉన్న వరి పైర్లు నేలవాలాయి. పత్తి చేలల్లోనూ భారీగా నీరు నిలిచింది.